క్లుప్తంగా

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



ఎల్లయ్యపేటలో సీసీ రోడ్డుకు భూమిపూజ చేసిన జెడ్పీ వైస్ చైర్మన్ పద్మలత

తొండంగి: మండలంలోని ఎల్లయ్యపేటలో సీసీరోడ్డు నిర్మాణానికి శుక్రవారం జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు భూమిపూజ చేశారు. రూ.25 లక్షలతో ఈ సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్టు సర్పంచ్ సింగిరి సింగరావు తెలిపారు. తీరప్రాంత గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణానికి కృషి చేస్తున్న రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజాకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మత్స్యకార విభాగం తుని నియోజకవర్గ కన్వీనర్ మేరుగు ఆనంద హరి, వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ గాబు రాజు, తుని మార్కెట్ కమిటీ సభ్యుడు బుర్తి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమాత ఊరేగింపు



హంసవరంలో ఆరోగ్యమాతను ఊరేగిస్తున్న సర్పంచ్, క్రైస్తవులు

తుని రూరల్: హంసవరంలో శుక్రవారం ఆర్‌సీఎం చర్చి వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్యమాతను క్రైస్తవులు గ్రామంలో ఊరేగించారు. ఇటీవల నూతనంగా నిర్మించిన చర్చిలో పాస్టర్లు సమష్ఠ దివ్య పూజ, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సర్పంచ్ రాయి మేరీఅవినాష్, పెద్ద సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి



తునిలో ఎస్ఎఫ్ఐ సైకిల్ యాత్ర ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ

తుని: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ కోరారు. విద్యారంగంలో సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన సంఘర్షణ సైకిల్ యాత్రను షేక్ సాబ్జీ ప్రారంభించారు. తొలుత స్థానిక పార్కు సెంటర్లో మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థి సంఘాలు చేపట్టిన యాత్ర ఈ నెల 14న కాకినాడకు చేరుకుంటుందని తెలిపారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎల్‌జీ నాయుడు, రాష్ట్ర కమిటీ సభ్యుడు జి.రాము, జిల్లా కార్యదర్శి సూరిబాబు, శ్రీకాంత్, సంజయ్, వాసు గోపాల్, లోవరాజు, చక్రధర్, యూటీఎఫ్ నాయకుడు జి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

రౌతులపూడి: తేటగుంట–రౌతులపూడి రహదారిలో బిల్లవాక వద్ద శుక్రవారం జరిగిన ప్రమాదంలో ఎస్. అగ్రహారం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ పల్లా వెంకటేష్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తేటగుంట నుంచి రౌతులపూడి వైపు వస్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న క్వారీ లారి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జు నుజ్జు కాగా ఆటో డ్రైవర్ వెంకటేష్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని కుటుంబ సభ్యులు వైద్యం కోసం తునిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రౌతులపూడి ఎస్సై అబ్దుల్ నబీ తెలిపారు.

గ్రామాల్లో నా భూమి-నా దేశం



ముక్కొల్లులో విద్యార్థులతో కలిసి మట్టిని సేకరిస్తున్న బీజేపీ నాయకులు

కిర్లంపూడి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం నా భూమి–నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ముక్కొల్లు, రామకృష్ణాపురం, రామచంద్రపురం గ్రామాల్లో బీజేపీ మండలాధ్యక్షుడు యడాలి రాంబాబు ఆధ్వర్యంలో మట్టిని సేకరించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా గ్రామాల్లో నా భూమి- నా దేశం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. బీజేపీ మండల ఉపాధ్యక్షుడు దొడ్డ అప్పారావు, కార్యవర్గ సభ్యులు అడారి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌జీ పేటలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు



తునిలో సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణి



కనకదుర్గమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

వరలక్ష్మీ నమోస్తుతే..

- భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు



పాతకొట్టాంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆచరిస్తున్న మహిళలు

తుని: స్థానిక పాతబజారు వీధి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలో పలు ప్రాంతాల నుంచి భారీగా మహిళలు తరలివచ్చి వరలక్ష్మీదేవికి కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మార్నీడి శ్రీనివాసరావు, ఈఓ పెన్మత్స విశ్వనాథరాజు, కౌన్సిలర్ అల్లాడ దివాణం పాల్గొన్నారు.

కోటనందూరు: మండలంలోని పాతకొట్టాం రామాలయంలో శుక్రవారం సమరసత సేవా ఫౌండేషన్, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. వేద పండితుడు రేగడమిల్లి ప్రదీప్‌శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి శాస్త్రోక్తంగా వ్రతాలు నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి వందలాదిగా మహిళలు తరలి వచ్చి కుంకుమ పూజలు చేసారు. ఆలయ కమిటీ సభ్యుడు యడ్ల చెల్లారావు, సమరసత ఫౌండేషన్ తుని సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ పంపనబోయిన వరహాలు తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: శ్రావణంలో చివరి శుక్రవారం కావడంతో ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పలు ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఇళ్ల వద్ద వరలక్ష్మీ వ్రతాలు ఆచరించిన భక్తులు సాయంత్రం ఆలయాల్లో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్, తోట వీధి, మార్కెట్ వీధి, దిబ్బలపాలెం తదితర ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తుని రూరల్: శ్రావణమాసంలో ఆఖరి శుక్రవారం కావడంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సుభద్రయ్యమ్మ పేటలోని పంచముఖ సాయిబాబా ఆలయంలో చిన్న షిర్డీ సాయి సేవా సంఘం ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. ఏకుల మాణిక్యం భక్తులకు ఉచితంగా వెండి రూపులు, దాతలు ఇతర పూజా సామగ్రిని సమకూర్చారు. ధర్మకర్త ఆళ్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మహాలక్ష్మీ అమ్మవారికి అర్చకులు నవకలశాలతో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. వివిధ రకాల ఫలాలు, పసుపు కొమ్ములతో అమ్మవారికి సౌభాగ్యదాయిని అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

దేవీచౌక్ ఆలయానికి పోటెత్తిన భక్తులు

గోకవరం: గ్రామంలో ప్రసిద్ధిగాంచిన దేవీచౌక్ ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. శ్రావణ మాసంలోని చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ ఆలయంలో కొలువైన కనకదుర్గమ్మను వెండి, బంగారు ఆభరణాలతో వరలక్ష్మీదేవిగా అలంకరించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఏలేశ్వరంలో ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి

తొండంగి: శ్రావణమాసం ఆఖరి శుక్రవారం కావడంతో మండలంలోని గోపాలపట్నం నేరేళ్లమ్మ అమ్మవారి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.



గోకవరంలో వరలక్ష్మీదేవి అలంకరణలో కనకదుర్గమ్మ

దుర్గమ్మ ఆలయాల్లో కుంకుమ పూజలు

కిర్లంపూడి: శ్రావణ మాసంలో చివరి శుక్రవారం కావడంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. జగపతినగరం అభయ దుర్గమ్మ, చిల్లంగి అష్టలక్ష్మీ, కిర్లంపూడి వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. కిర్లంపూడి గ్రామ శివారున వేంచేసిన వనదుర్గమ్మ ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

కనకదుర్గ అమ్మవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

రౌతులపూడి: స్థానిక సినిమా సెంటర్‌లో వెలసిన కనకదుర్గ అమ్మవారి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కాజులూరు మండలం దుగ్గుదుర్రు గ్రామానికి చెందిన ఆగమ పండితులు పూజ్యం నాగేశ్వరరావు శర్మ బృందం ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాలను ప్రారంభించారు. సాయంత్రం అమ్మవారికి హోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను దంపతులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ బుల్లిబాబు

తుని రూరల్: లోటు వర్షపాతం కారణంగా పలు గ్రామాల్లో ఖరీఫ్ వరినాట్లు వేయలేదని, ఆయా గ్రామాల్లో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయ సహాయ సంచాలకులు సుంకర బుల్లిబాబు అన్నారు. తుని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము అధ్యక్షతన మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ డి.పోలవరం, వి.కొత్తూరు, హంసవరం గ్రామాల్లో ఆరుతడిగా వరిసాగు చేసేందుకు 66 క్వింటాళ్ల విత్తనాలకు ప్రతిపాదనలు పంపించామన్నారు. మూడు గ్రామాల్లో ఎరువులు నిల్వ చేసేందుకు అవసరమైన గొడౌన్లు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. యాంత్రీకరణ నిధులు ఉన్నాయని, వినియోగానికి ప్రభుత్వం అనుమతిస్తే రాయితీపై యంత్రాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వి.కొత్తూరులో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, పశువులపై దాడి చేస్తూ గాయపరుస్తున్నాయని మండలి సభ్యుడు దుంగల నాగేశ్వరరావు తెలిపారు. చెక్ డ్యాం లాకులకు మరమ్మతులు చేయించాలని సూచించారు. సభ్యులు చిటికెల వరహాలబాబు, కుర్ర నాగేశ్వరరావు, డీపీ నాయుడు, ఏఓ బి.అశోక్ కుమార్, ఏఈఓ పి.జగ్గఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటిని పొదుపుగా వాడుకునేలా ప్రోత్సహించాలి

కోటనందూరు: తాండవ జలాశయంలో అరకొర నీటినిల్వలు ఉన్న నేపథ్యంలో సాగునీటిని పొదుపుగా వాడుకునేలా రైతులను ప్రోత్సహించాలని ఏఓ చంద్రశేఖర్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ లగుడు శ్రీనివాసు అధ్యక్షతన వ్యవసాయ సలహా మండలి మండలస్థాయి సమావేశం జరిగింది. ఏఓ మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులు, తాండవలో నీటి నిల్వల ఆధారంగా వరినాట్లు వేసేలా రైతులను చైతన్యం చేయాలన్నారు. నీరందని శివారు ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించేలా ప్రోత్సహించాలన్నారు. పంట వేసిన ప్రతి రైతు విధిగా ఈ– క్రాప్ చేయించుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏఎంసీ మండలాధ్యక్షుడు సుర్ల రాజు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనరు చింతకాయల చినబాబు, ఏఎంసీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం

శంఖవరం: ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని మండల ఏఓ పి.గాంధీ, హెచ్ఓ పి.అరుణకుమార్ అన్నారు. స్థానిక ఆర్బీకేలో శుక్రవారం మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నడిగట్ల నానాజీ అధ్యక్షతన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ గాంధీ మాట్లాడుతూ పంటలకు నీరు అందించేందుకు డ్రిప్ పరికరాలను ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తుందన్నారు. ఆర్బీకేల ద్వారా ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అందిస్తున్నట్టు చెప్పారు. రైతులు తాము సాగు చేసిన పంటలకు ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



ఏలేశ్వరం సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

రైతుల కోసం అనేక పథకాలు

ఏలేశ్వరం: రైతుల కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో శుక్రవారం ఏఓ జ్యోతి అధ్యక్షతన వ్యవసాయ సలహామండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ఆర్‌బీకేల ద్వారా రైతులకు ఎరువులు, విత్తనాలు అందజేస్తున్నారన్నారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సలహా మండలి చైర్మన్ గొల్లపల్లి కాశీవిశ్వనాథ్, సొసైటీ చైర్మన్లు చిక్కాల లక్ష్మణరావు, కొండపల్లి వెంకటేశ్వరరావు, రైతులు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

చివరి మజిలీ సమస్యలకు చెక్



శ్మశానవాటికకు కేటాయించిన స్థలాన్ని చదును చేయిస్తున్న సర్పంచ్ కుమార్‌రాజా

- అన్నవరం శ్మశానవాటిక నిర్మాణానికి నేడు భూమిపూజ
- పంపా నది ఒడ్డున 1.20 ఎకరాల స్థలంలో నిర్మాణం
- హాజరు కానున్న ఎంపీ గీత, ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

అన్నవరం: గ్రామంలో దశాబ్దాల సమస్యకు పరిష్కారం లభించింది. గ్రామంలో హిందూ శ్మశానవాటిక నిర్మాణానికి శనివారం మధ్యాహ్నం 2 గంటలకు కాకినాడ ఎంపీ వంగా గీత, ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ శంకుస్థాపన చేయనున్నారు. ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ కృషి మేరకు ఆరెంపూడి పరిధిలోని సర్వే నంబర్ 76లో పంపా రిజర్వాయర్‌ను ఆనుకుని ఉన్న 1.20 ఎకరాల స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం శ్మశానవాటికకు కేటాయించింది. ఈ స్థలాన్ని రెవెన్యూ శాఖ ద్వారా గ్రామ పంచాయతీకి అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా ఆదేశాలు జారీ చేశారు. ఈ స్థలంలో శ్మశానవాటిక నిర్మిస్తున్నారు.

దశాబ్దాల కల సాకారం

ప్రముఖ పుణ్యక్షేత్రంగా పేరొందిన అన్నవరానికి ఇప్పటి వరకూ సరైన శ్మశానవాటిన లేదు. దీంతో ఏళ్ల తరబడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామం ఏర్పడినప్పటి నుంచి పంపా సర్‌ప్లస్ కాలువ పక్కన గల స్థలంలోనే అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. వర్షాకాలం, పంపా బ్యారేజీ నీటిని విడుదల చేసినప్పుడు అక్కడ దహనసంస్కారాలకు అవకాశం ఉండేది కాదు. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బంది పడేవారు.

పిఠాపురంలోనే అంత్యక్రియలకు బ్రాహ్మణుల మొగ్గు

అన్నవరంలో శ్మశాన వాటిక లేకపోవడంతో బ్రాహ్మణ సామాజిక వర్గీయులు మృతదేహాలను పిఠాపురం శ్మశానవాటికకు తరలించి అక్కడే అంత్యక్రియలు చేయిస్తున్నారు. గత 25 సంవత్సరాలుగా హిందూ శ్మశానవాటిక కోసం ప్రయత్నాలు జరుగుతున్నా పెద్దగా పట్టించుకున్న నాథుడు లేడు. ఈ పరిస్థితుల్లో ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ చొరవతో ప్రస్తుతం శ్మశానవాటిక నిర్మిస్తుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వసతుల కల్పనకు చర్యలు

శ్మశానవాటికతో పాటు అక్కడ వసతుల కల్పనకూ చర్యలు తీసుకుంటున్నట్టు అన్నవరం సర్పంచ్ కుమార్ రాజా తెలిపారు. మృతదేహాలను దహనం చేసేందుకు బెడ్స్, దహన సంస్కారానికి వచ్చే జనం వేచి ఉండేందుకు షెల్టర్స్, నీటి సదుపాయం, అస్తికలు భద్రపరిచేందుకు లాకర్లు, మెయిన్ రోడ్ నుంచి శ్మశానవాటిక వరకూ రోడ్డు నిర్మాణం చేపడతామని సర్పంచ్ వివరించారు.

రెడ్డి సంక్షేమ సంఘం అభివృద్ధికి కృషి



తునిలో వెంకటరెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

తుని: కోస్తాఆంధ్రా రెడ్డి సంక్షేమ సంఘం అభివృద్ధికి కృషి చేయాలని తుని–పాయకరావు పేట రెడ్డి సంఘం అధ్యక్షుడు కె.కిశోర్‌రెడ్డి కోరారు. తునిలో శుక్రవారం కోస్తా ఆంధ్రా రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కర్రి త్రినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జిల్లా గౌరవ సలహాదారులుగా నియమితులైన మేడపాటి వెంకటరెడ్డిని సత్కరించారు. ప్రతి నెల నిర్వహించే సమావేశాల్లో సభ్యులంతా చురుకైన పాత్ర పోషించాలని కోరారు. సంఘం నాయకులు పి.శ్రీనివాసరెడ్డి, ఎం.వెంకటరెడ్డి, కె.వెంకట రామలింగారెడ్డి, నారాయణ రెడ్డి, శివారెడ్డి, రాజా రెడ్డి, సతీష్ రెడ్డి, ఎస్.వెంకటరెడ్డి, ఎస్.శ్రీనివాసరెడ్డి, లచ్చారెడ్డి, అజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'ను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ పద్మజ్యోతి

కోటనందూరు: గ్రామాల్లో ఈ నెల 15 నుంచి నిర్వహించే 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, పారామెడికల్ సిబ్బంది, ఐసీడీఎస్, విద్యాశాఖ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శర్మ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షపై ఈ నెల 15 నుంచి వలంటీర్లు ఇంటింటా విస్తృతంగా ప్రచారం చేస్తారన్నారు. 16వ తేదీ నుంచి వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహించి ఆరోగ్య సమస్యలను గుర్తించాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 30 నుంచి నెల రోజుల పాటు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తారన్నారు. ఈ వైద్య శిబిరాల్లో స్పెషలిస్టు డాక్టర్లు, పీహెచ్‌సీ డాక్టర్లు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. అవసరమైతే పెద్దాసుపత్రులకు రిఫర్ చేసి ఉచితంగా ఆరోగ్య సేవలు అందిస్తారన్నారు. అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో పని చేసి ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్, వైద్యులు స్వర్ణప్రియాంక, యమిలి, ఎంఈఓ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష

గోకవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ కె.పద్మజ్యోతి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఈఓపీఆర్‌డీ రాజేశ్వరరావు అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సర్వే చేస్తారన్నారు. ఈ సర్వేకు అన్నిశాఖల అధికారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ బి.గౌరమ్మ, కార్యదర్శులు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కొత్తపల్లి: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందినట్టు స్థానిక పోలీసులు శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కుతుకుడుమిల్లి గ్రామానికి చెందిన దుబాకుల మధుసూదనరావు(30) ఈ నెల 4వ తేదీ రాత్రి కొత్తపల్లి నుంచి ఉప్పాడ మోటార్ సైకిల్‌పై వెళుతున్నాడు. రవీంద్రపురం వద్ద ఆగి ఉండగా ఉప్పాడకు చెందిన ముత్యాల నూకరాజు మోటార్ సైకిల్‌తో వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మధుసూదనరావు తలకు తీవ్రగాయం కాగా చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. దీనిపై ఎస్సై రామలింగేశ్వరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా పైడిమల్లమ్మ తీర్థం



నిప్పుల గుండం వద్దకు ఊరేగింపుగా పూజారిని తీసుకువస్తున్న భక్తులు

ఏలేశ్వరం: ఏలేశ్వరం గ్రామ దేవత పైడిమల్లమ్మ అమ్మవారి తీర్థం శుక్రవారం వైభవంగా జరిగింది. అమ్మవారి తీర్థ మహోత్సవాల్లో భాగంగా స్థానిక పెద్దవీధిలోని అమ్మవారి ఆలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిప్పుల గుండాన్ని పూజారి తొక్కారు. స్థానిక దిబ్బలపాలెం నుంచి పూజారిని శక్తివేషం, తీన్‌మార్, బాణసంచా కాల్పున నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చారు. నిప్పుల గుండం చూసేందుకు మహిళలు పోటీ పడ్డారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

వైభవంగా శ్రీకృష్ణుని ఊరేగింపు



లింగంపర్తిలో స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

ఏలేశ్వరం: శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా శుక్రవారం లింగంపర్తిలో స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. త్రైత సిద్ధాంత ఆదికర్త, శతాధిక గ్రంథకర్త ఆచార్య ప్రబోధనందా యోగీశ్వరుల ఆశీస్సులతో రాజమహేంద్రవరానికి చెందిన జ్ఞానవేదిక ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని ఊరేగించారు. లింగంపర్తిలో ఉత్సవ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు కిల్లి శేఖర్, దవులూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో మూడురోజులపాటు నిర్వహించిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఈ ఊరేగింపుతో ముగిశాయి. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కీలు సత్యనారాయణ, కీలు అన్నవరం, శాంతి, దేవి, భక్తులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో కృష్ణాష్టమి

కిర్లంపూడి: కిర్లంపూడిలో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శుక్రవారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఆలయ అర్చకులు గోవర్ధనం శ్రీధర్ ఆచార్యులు ఆధ్వర్యంలో పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద ఉట్టి ఉత్సవం ఏర్పాటు చేశారు. ఉట్టిను కొట్టేందుకు స్థానికులు పోటీ పడ్డారు. కార్యక్రమంలో పెంటకోట నాగబాబు, వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, శరకణం సంతోష్, సంఘున వెంకటేశ్వరావు, నైదాన రఘు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురువందన్ ఛత్రాభినందన్



తునిలో విద్యార్థి తల్లిని సత్కరిస్తున్న భారత్ వికాస్ పరిషత్ ప్రతినిధులు

తుని: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో గురువందన్ ఛత్రాభివందన్ కార్యక్రమం నిర్వహించారు. గత ఏడాది 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన స్థానిక గర్ల్స్ హైస్కూల్, ఎస్.సూరవరం, అద్దరిపేట, బొద్దవరం హైస్కూళ్లకు చెందిన పోతంశెట్టి వెంకటనందిని, చవ్వాకుల కల్యాణి, బి.గౌరీవాసవి, ఎస్‌కే సమీరాబేగం, నీలి కావ్యశ్రీ, వారి తల్లిదండ్రులు, వారికి బోధించిన ఉపాధ్యాయులను వికాస్ పరిషత్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. క్రమశిక్షణతో మెలిగి బంగారు భవిష్యత్ బాటలు వేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షులు ఎంవీ సూర్యనారాయణరాజు, అధ్యక్షులు పీఎల్ ఆచార్యులు, జాయింట్ సెక్రటరీ నెల్లిపూడి నాగేశ్వరరావు, కోశాధికారి గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా ఎస్ఈబీ దాడులు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) పరిధిలో గ్రామాల్లో శుక్రవారం విస్తృతంగా దాడులు నిర్వహించినట్టు ఎస్ఈబీ సీఐ పి.అశోక్ తెలిపారు. ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెంలో సారా స్థావరంపై దాడి చేసి సారా తయారీకి సిద్ధం చేసిన 400 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సంఘటన స్థలం నుంచి 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఏలేశ్వరం మండలం లింగాలకాలనీలో 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఈ రెండు సంఘటనల్లో పరారైన రాళ్ల శివ, గారా వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

టీబీ రోగులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ



తొండంగిలో టీబీ రోగులకు పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న అరబిందో సంస్థ ప్రతినిధులు

తొండంగి: స్థానిక పీహెచ్‌సీలో టీబీ రోగులకు శుక్రవారం పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేశారు. అరబిందో జాతీయ టీబీ నివారణ కార్యక్రమంలో భాగంగా అరబిందో సంస్థ ఆర్థిక సహకారంతో ఆసుపత్రిలోని 25 మంది రోగులకు పౌష్టికాహార కిట్లు అందజేశారు. టీబీ రోగులు ఆరోగ్యంపై అధిక శ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యారోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.